క్లుప్తంగా

విద్యుత్ ఏఈగా ఖలీల్‌పాషా



గడివేముల: మండల విద్యుత్‌శాఖ ఏఈ గా ఖలీల్‌పాషా శనివారం బాధ్యతలు చేపట్టారు. కొన్ని రోజులుగా ఏఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఉన్నతాధికారులు కర్నూలు హెచ్‌టీ మీటర్స్‌-1 నుంచి ఖలీల్‌ను గడివేములకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ తేజస్విని

గడివేముల: ప్రభుత్వం ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందిస్తోందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ తేజస్విని అన్నారు. శనివారం డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి



అమడగుంట్లలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు: చిన్నచిన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని అమడగుంట్ల, అనుగొండ గ్రామాల్లో ఎస్‌ఐ శ్రీనివాసులు పర్యటించి ప్రజల నుంచి వచ్చిన వివిధ కేసులపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవ్వరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. తగాదాల వల్ల కేసుల్లో ఇరుక్కొని ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



సంగాలలో వైద్య సేవలను ఆరా తీస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను

సి.బెళగల్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను వైద్యులను కోరారు. శనివారం మండలంలోని సంగాల గ్రామంలో సి.బెళగల్ పీహెచ్‌సీ వైద్య బృందం నిర్వహిస్తున్న 104 వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్నం వరకు మాత్రమే పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి శిబిరంలో ఉండి అనంతరం రోగులకు అందుబాటులో లేకుండా సి.బెళగల్‌కు వెళ్లిపోవడాన్ని తెలుసుకుని జెడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్‌పై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సమయానుసారంగా ఆరోగ్యసేవలందించాలి

కర్నూలు(హాస్పిటల్): ఏఎన్‌ఎం, ఆశాల సమన్వయంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలోని ఆరోగ్యసేవలను ఎంఎల్‌హెచ్‌పీలు సమయానుసారంగా రోగులకు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య ఆదేశించారు. శనివారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. పాము, తేలు, కుక్కకాటుకు ప్రథమ చికిత్స, రోడ్డు ప్రమాద కేసులకు సత్వర ప్రథమ చికిత్సలు అందించి పై ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం గురించి శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లోని పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందించి ఆ వివరాలను హెచ్‌డబ్ల్యూసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీఓ విజయరాజు, నోడల్ ఆఫీసర్లు ఐజాల్ హక్, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు రుక్మిణి, సరళ, అరుణ, నారాయణమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద చేపట్టే విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఈఈ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా బాబు జగ్జీవన్ రామ్ నగర్, గిప్సన్ కాలనీ, ఈశ్వర్ నగర్, నరసింహరావు పేట, ఈసీఎం కాంపౌండ్, సంకల్‌బాగ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేయన్నుట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సూచనల మేరకు కోతలు విధిస్తున్నామని, ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న సురక్షలో ఎమ్మెల్యే కాటసాని
- ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు మంజూరు
- దరఖాస్తుదారుల్లో వెల్లివిరిసిన ఆనందం



హుసేనాపురంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, గ్రామ సర్పంచు చంద్ర గోవర్ధనమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా అనర్హులకు ప్రభుత్వ పథకాలను మంజూరు చేశారని విమర్శించారు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గ్రామాల్లో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల పథకాలు అందజేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రాలు మండలాలకు వెళ్లి తెచ్చుకునేవారు. ప్రస్తుతం జగనన్న సురక్ష పథకం ద్వారా అధికారులే ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నారని చెప్పారు. హుసేనాపురం గ్రామంలో ఒకే రోజు 500కు పైగా మందికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. పింఛన్లు మినహా ఇప్పటి వరకు మండలంలో రూ.2.16 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. కాల్వబుగ్గ, హుసేనాపురం గ్రామాల్లో ఇళ్ల పట్టాలు, అసైన్డు భూముల సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, గ్రామ సర్పంచు గోవర్ధనమ్మ, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, స్థానిక నాయకులు గుర్రాల చెన్నారెడ్డి, చంద్ర పెద్దస్వామి, జీకే వెంగన్న, వెంకటరమణారెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా 11 రకాల సేవలు

పాణ్యం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని అన్నారు. శనివారం పాణ్యం సచివాలయం-1పరిధిలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు సేవ చేయడంలో ఏపీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటునామన్నారు. ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే దరఖాస్తులు పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. పాణ్యం-1సచివాయం పరిధిలో 1064 కుటుంబాలు ఉండగా, వీటిలో 858 కుటుంబాలకు సర్వే చేశామన్నారు. వీరికి అవసరమైన సర్వీసులు అందించినట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ గుద్దేటి సుమంత్‌రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ రఘురామిరెడ్డి, తహసీల్దార్ మల్లిఖార్జునరెడ్డి, ఎంపీడీ దస్తగిరి, ఈఓఆర్డీ భాస్కర్ రావు, కరుణాకర్‌రెడ్డి కో- ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, చందమామ బాబు, రాజన్న, మార్క్‌ఫెడ్ అధికారులు, మండలస్థాయి అధికారులు, గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాణ్యం నియోజకవర్గంలో తొలి రోజు జగనన్న సురక్ష కార్యక్రమం జరిగిన గ్రామాలు, జారీ చేసిన ధ్రువ పత్రాల వివరాలు

మండలం	సచివాలయం	జారీచేసిన ధ్రువ పత్రాలు
ఓర్వకల్లు	హుసేనాపురం	500
పాణ్యం	పాణ్యం సచివాలయం-1	971
గడివేముల	గడివేముల సచివాలయం-1	210
కల్లూరు	కె.మార్కాపురం,చిన్నటేకూరు	672

గడివేముల మండలంలో..

గడివేముల: అర్హులకు నూరు శాతం సంక్షేమ పథకాలు అందించడయే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి,ఎంపీపీ నాగమద్దమ్మ తెలిపారు. శనివారం స్థానిక గడివేముల సచివాలయం-1లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏపీఎం హజరత్, ఏఓ హేమసుందర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ మూర్తి, ఎంపీటీసీ వంగాల మహేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ బాలచెన్ని, ఈఓపీఆర్డీ అబ్దుల్ ఖాలిక్, పంచాయతీ కార్యదర్శులు తారకేశ్వరి, రంగడు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు మండలం చిన్నటేకూరులో నిర్వహించిన జగనన్న సురక్షలో డీఎల్‌పీఓ తిమ్మక్క, తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు, సర్పంచ్ టి.లక్ష్మన్న కె. మార్కాపురంలో గ్రామంలో ఎంపీడీఓ రమణామూర్తి, డిప్యూటీ తహశీల్దార్ గిరికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

డెత్ సర్టిఫికెట్ అందజేశారు



మా నాన్న వెంకటేశ్వర్లు వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీరు మా ఇంటి వద్దకు వచ్చి ఏవైనా సర్టిఫికెట్లు అవసరమా అని అడిగారు. నాన్న డెత్ సర్టిఫికెట్, ఆదాయ, కుల, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు కావాలని చెప్పడంతో ఆన్‌లైన్‌లో నమోదు చేశాడు. ఈ రోజు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో అవన్నీ పైసా ఖర్చులేకుండా అందజేశారు. లేకపోతే ఆయా సర్టిఫికెట్ల కోసం ఎంతో ఇబ్బంది పడాల్సి వచ్చేది. –శ్రీధర్, గడివేముల

కొత్త రేషన్ కార్డు వచ్చింది



ప్రభుత్వం మాలాంటి వారికి అండగా నిలబడుతోంది. అవసరమైన ప్రతి సేవను సచివాలయం ద్వారా అందజేస్తుంది. కొడుకు, కోడలు నుంచి నన్ను వేరు చేసి ప్రత్యేకంగా రేషన్ కార్డు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పుడు నాకు కొత్త కార్డు మంజూరు చేశారు. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం ద్వారా వారం రోజుల్లోనే ఈ సమస్య పరిష్కారమైంది. లేకపోతే కొత్త కార్డు కోసం తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. రూపాయి ఖర్చులేకుండా కొత్తకార్డు ఇచ్చిన అధికారులకు, ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. –బానాల సుగుణమ్మ, గడివేముల



అమడగుంట్లలో ప్రజలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, డీపీఓ నాగరాజనాయుడు

అర్హులకు మేలు చేసేందుకే జగనన్న సురక్ష

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవంలో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్/సి.బెళగల్/ గూడూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం కోడుమూరు మండలం వెంకటగిరి, అమడగుంట్ల, సి. బెళగల్ మండలం సంగాల, గూడూరు మండలంలో గూడూరు , పెంచికలపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని వివిధ రకాల సేవలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ అవసరమొచ్చిన జన్మభూమి కమిటీ సభ్యులు, దళారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నేడు జగనన్న పాలనలో ఏ ప్రభుత్వ పథకమైనా ప్రజల చెంతకే చేరుతుందన్నారు. ఎవరైనా మిగిలి ఉంటే వారికి కూడా లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లే ఇంటికి వచ్చి అర్హులను గుర్తిస్తారన్నారు. పారదర్శక పాలన అందిస్తున్న జగనన్నకు వచ్చే ఎన్నికల్లో మరోసారి పట్టం కట్టాలని కోరారు. డీపీఓ నాగరాజనాయుడు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమడగుంట్లలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అమడగుంట్ల క్రిష్టారెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, సంగాలలో సి.బెళగల్ జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, గూడూరులో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, పెంచికలపాడులో జెడ్పీటీసీ మౌలాలి, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోడుమూరు నియోజకవర్గంలో తొలి రోజు జగనన్న సురక్ష కార్యక్రమం జరిగిన గ్రామాలు, జారీ చేసిన ధ్రువ పత్రాల వివరాలు

మండలం	సచివాలయం	జారీచేసిన ధ్రువ పత్రాలు
కర్నూలు	పంచలింగాల	333
	బి. తాండ్రపాడు	200
గూడూరు	గూడూరు అర్బన్-1	300
	పెంచికలపాడు	410
సి. బెళగల్	సంగాల	149
	చింతమానుపల్లి	78
కోడుమూరు	అమడగుంట్ల	528
	వెంకటగిరి	220

- సి. బెళగల్ మండలం చింతమానుపల్లె గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, ఈఓఆర్డీ సందీప్ గ్రామ సర్పంచ్ రోజా, ఎంపీటీసీ సభ్యురాలు గొల్ల రంగమ్మ హాజరై దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు.

- జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. శనివారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు ఆదాయ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, ఈఓఆర్‌డీ నాగేశ్వర రెడ్డి, తహసీల్దార్ శివరాముడు, వైస్ ఎంపీపీ-2 నెహెమ్యా, అలాగే బి. తాండ్రపాడు గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ అజామ్‌ఖాన్, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, మాజీ ఎంపీటీసీ చిన్న లక్ష్మన్న, సచివాలయ కన్వీనర్ మోహన్ పాల్గొన్నారు.

జీవనోపాధులు మెరుగుపర్చుకోవాలి

- సెర్ప్ సీఈఓ ఇంతియాజ్



ఉల్లి సోలార్ డ్రయర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సెర్ప్ సీఈఓ ఇంతియాజ్

కల్లూరు: ప్రభుత్వ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధితో జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలని సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ అన్నారు. శనివారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో కూరగాయల సోలార్ డ్రయర్ల యూనిట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఉల్లి సోలార్ డ్రయర్ యూనిట్‌ను ప్రారంభించి మాట్లాడారు. యూనిట్ విలువ లక్ష రూపాయలు కాగా అందులో సబ్సిడీ రూ. 35వేలు ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటివి 40వేల యూనిట్లు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధిలో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాహెరాబీ, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, పొదుపు సంఘం సభ్యురాలు జుబేదా బీ, వైఎస్సార్ క్రాంతి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి గోశాల దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మాణిక్యమ్మ(65) మృతి చెందారు. ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపిన వివరాలు... కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన పాండు రంగారెడ్డి, మాణిక్యమ్మ దంపతులు కొన్ని సంవత్సరాలుగా దినెన్నదేవపాడు గ్రామ పరిధిలోని స్కంద సెంట్రల్ స్టోర్‌లో పని చేస్తూ అక్కడే నివసిస్తున్నారు. శనివారం ఇంట్లోకి సరుకులు తెచ్చుకోవడానికి టీవీఎస్ ఎక్సెల్ బండిపై కర్నూలుకు బయలుదేరారు. 44వ జాతీయ రహదారి గోశాల దగ్గర రోడ్డుకు ఎడమ వైపున వెళ్తుండగా హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్తున్న బైక్ వెనుక నుంచి ఢీ కొట్టగా వారు ఎగిరి కింద పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి రక్త గాయాలు కాగా 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మాణిక్యమ్మ ప్రాణాలు కోల్పోగా పాండు రంగారెడ్డి చికిత్స పొందుతున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు బోల్తా

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట సమీపంలోని కేశవరెడ్డి స్కూల్ వద్ద కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది శనివారం తెలిపారు. నంద్యాల నుంచి కర్నూలు వస్తుండగా వెనుక నుంచి మరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు వారు వెల్లడించారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కేసు నమోదు

సి.బెళగల్: మండల పరిధిలోని ముడుమాల గ్రామంలో వ్యవసాయ మోటార్ల చోరీపై బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పీరయ్య తెలిపారు. గ్రామానికి చెందిన రైతులు కురువ పెద్ద సోమప్ప, చాకలి ఆంజనేయులు, కురువ హనుమంతు, తెలుగు నాగేష్ పొలాల్లోని వ్యవసాయ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధిత రైతులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు శనివారం డ్యాం అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, డ్యాంలో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

లంబాడీలు హక్కులు సాధించుకోవాలి



నందనపల్లె సుగాలి తండాలో ఎల్‌హెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు (న్యూటౌన్) : లంబాడీలు రాజ్యాంగం కల్పించిన హక్కులు సాధించుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాస్ నాయక్ అన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు ఖేతావత్ లక్ష్మణ్ నాయక్, నేణావత్ రాము నాయకుల ఆధ్వర్యంలో నందనపల్లి సుగాలి తండాలో ఎల్‌హెచ్‌పీఎస్ జెండాను కైలాస్ నాయక్ ఆవిష్కరించి మాట్లాడారు. లంబాడీల జీవితాలు బాగు చేయడానికి తాము సంఘాన్ని స్థాపించామన్నారు. గడచిన 25 సంవత్సరాలుగా జాతి ప్రయోజనాల కోసం పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, రథయాత్రలు, నిరసన కార్యక్రమాలు, ధర్నాలు, బహిరంగ సభలు ఇలా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవావత్ శంకర్ నాయక్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయ నాయక్, యువకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): కొత్తగా ఏర్పాటైన నంద్యాల జిల్లా జువైనల్ జస్టిస్ బోర్డు చైర్‌పర్సన్, మెంబర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాలల సంక్షేమం, సంస్కరణ సేవల శాఖ పర్యవేక్షకుడు వైఎల్ ఎన్ దివాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగి అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్దేశిత ఫార్మెట్‌లో జూలై 13వ తేదీలోపు విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. విద్యార్హతలు, అనుభవం, ఎంపిక విధానం, ఇతర వివరాల కోసం WDCW.AP.GOV.IN అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఉదయాన్నే పింఛన్ పిలుపు



గడిగరేవుల గ్రామానికి చెందిన షేక్ రమిజాబీకి వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీరు రేష్మాబీ



కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న కలిమద్దెల గ్రామ వృద్ధుడు తెలుగు నారాయణకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీరు డాలుస్వామి

ఉదయాన్నే తలుపుతట్టి ఠంచన్‌గా పింఛన్ అందజేయడంతో అవ్వాతాతల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. పొలాల్లో పనిచేస్తున్న వారికి, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు అక్కడే వెళ్లి పింఛన్ కానుక అందజేశారు. పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లో తొలి రోజే 80 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేశారు. వేలిముద్రలు, ఐరిష్ నమోదు కాని వారికి ముఖ గుర్తింపు ద్వారా అందజేశారు. పెన్షన్ పంపిణీ ప్రక్రియను మండల అధికారులు పర్యవేక్షించారు. కాగా గూడూరు అర్బన్‌లో మొత్తం 3170 మంది ఫింఛన్ దారులుండగా 2921 మందికి, రూరల్‌లో 2,216 మంది ఉండగా 1,982 మందికి పింఛన్ అందించినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, ఎంపీడీఓ మాధవీలత తెలిపారు. కల్లూరు మండలంలో 8,146 మంది లబ్ధిదారులు ఉండగా శనివారం సాయంత్రానికి 6,948 (85శాతం) మందికి, కోడుమూరు మండలంలో 8,782 మంది ఉండగా 7,676 మందికి పింఛన్ సొమ్ము అందజేశారు. –గడివేముల/గూడూరు/ కల్లూరు/కోడుమూరు రూరల్

పొదుపు మహిళలకు చేయూత

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

గూడూరు: పొదుపు సంఘాల మహిళలకు మత్స్య శాఖ ద్వారా చేయూత ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శనివారం సుంకేసుల గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు సబ్సిడీతో ఏర్పాటు చేసిన ఫిష్ కియోస్క్ యూనిట్‌ను సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో ఫిష్ కియోస్క్ యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా రూ.పది లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన యూనిట్‌ను పొదుపు మహిళల ఉపాధి కోసం కేటాయించినట్లు తెలిపారు. పొదుపు సంఘాల మహిళలు గ్రూపుగా ఏర్పడితే మత్స్య శాఖ నుంచి 60 శాతం సబ్సిడీ, లబ్ధిదారుల వాటా 40 శాతంగా ఉంటుందన్నారు. వీరికి ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్(పీఎంఎఫ్‌ఎంఈ) ద్వారా 35 శాతం ఆర్థిక సాయం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, మత్స్య శాఖ అధికారి శ్యామల పాల్గొన్నారు.

26 నుంచి పాదయాత్ర



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నారాయణ

గూడూరు: కోడుమూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 30 వ తేదీ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో గూడూరు, కోడుమూరు, సి.బెళగల్ మండలాల కార్యదర్శులు, ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సాగు నీటి ప్రాజుక్టులు, సి.బెళగల్ చెరువును రిజర్వాయర్‌గా మార్పు చేయాలని, కోడుమూరు, గూడూరు పట్టణ ప్రజలకు తాగు నీటి సమస్య పరిష్కారానికి ఎస్.ఎస్ ట్యాంకులు నిర్మించాలని, అధ్వానంగా ఉన్న రోడ్లను బాగుచేయాలనే తదితర డిమాండ్లతో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. పాదయాత్రకు పెద్ద ఎత్తున ప్రజల భాగస్వామ్యం ఉండేలా పార్టీ నాయకులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శులు మోహన్, గఫూర్‌మియా, హుసేనయ్య పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



ప్రభుత్వ పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: సీఎం వైఎస్ జగనమోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా గడప గడపకూ చేరుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక నేసేగేరి, కొత్తపేటలలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పథకాల అమలు తీరు, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. పింఛన్లు, బియ్యం కార్డులు కావాలని, సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించాలని, ఇళ్ల స్థలాలు చూపాలని కొత్తపేట వాసులు కోరగా.. స్పందించిన ఆయన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు పలువురు లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను పంపిణీ చేశారు.

జగనన్న పాలనలో అవినీతికి చోటు లేదు

అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ జగనన్న పాలనలో అవినీతికి చోటు లేదని, ఏ పథకమైనా సచివాలయం, వలంటరీ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల ముంగిటకే చేరుతున్నాయని చెప్పారు. గడప గడపలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, ఏఈ గంగరాజు, ఈఓ అజయ్‌భాస్కర్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్, షాకీర్‌బాషా, ప్రతాప్‌రెడ్డి, బలరాం, మధు, అయ్యప్ప, మల్లేష్, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

గాతరహే మేరదిల్

కర్నూలు కల్చరల్: హైదరాబాద్, బెంగళూరు కళాకారులతో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గాతరహే మేరదిల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. గాయనీ గాయకులు హైదరాబాద్‌కు చెందిన అలీ అబ్బాస్, బెంగళూరుకు చెందిన నబీబేగ్, రాయచూర్‌కు చెందిన ఇక్బాల్, కర్నూలుకు చెందిన విజయలక్ష్మి, ఫయామ్ పాటలు ఆలపించనున్నట్లు పేర్కొన్నారు.